క్లుప్తంగా

వేద పాఠశాలకు భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం అగ్రహారంలో వేద పండితులు కొల్లూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వేద పాఠశాల, గోశాల భవన నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. వేద పాఠశాల నిర్మాణానికి సుబ్రహ్మణ్యం పూర్వీకులు స్థలం కేటాయించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పితాని బాలకృష్ణ, పెన్మత్స చిట్టిరాజు, పుల్లెల సూరిబాబు, పుల్లెల భీమశంకరం, మామిడిపల్లి దేవకానంద శర్మ, మామిడిపల్లి గంగాధరం శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న చక్రస్నానం



పుష్కరిణిలో వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహానికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానం కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 8.02 గంటలకు స్వామివారికి చక్ర స్నానం వైభవంగా నిర్వహించారు. తొలుత దేవస్థానం గర్భాలయంలో ఉన్న స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఆలయ ప్రాంగణంలో వేద మంత్రాలు, మంగళ వాయిదాల మధ్య ఊరేగించారు. అనంతరం దేవస్థానం ప్రాంగణంలో ఉన్న పుష్కరిణి(కోనేరు)లో స్వామికి చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు, అర్చకుల పర్యవేక్షణలో క్రతువు జరిగింది. అనంతరం పూర్ణాహుతి జరిపారు.

ఘనంగా చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం ఘనంగా జరిగింది. మంగళవారం ఆలయంలో పౌర్ణమి తిథిని పురస్కరించుకుని భద్రకాళీ అమ్మవారికి ఆలయ అర్చకులు పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, చండీ పారాయణ, చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా యల్లారమ్మ జాతర



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో వేంచేసియున్న గ్రామదేవత యల్లారమ్మ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలకరించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించి, గరగ నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

అమలాపురం టౌన్: పట్టణంలోని పన్ను చెల్లింపుదారులు ప్రభుత్వం ఇచ్చిన 5 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ విజ్ఞప్తి చేశారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఈ నెల 30వ తేదీలోగా మొత్తం ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మరో వారం రోజులే గడువున్న నేపథ్యంలో పట్టణవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

25 నుంచి పింఛన్‌దారుల సంతకాల సేకరణ

యానాం: పుదుచ్చేరి మత్స్య శాఖ ఆదేశాల మేరకు ఈ నెల 25 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకూ పింఛన్‌దారుల నుంచి సంతకాలను సేకరించనున్నట్లు మత్స్య శాఖ ఏడీ దడాల గొంతియ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్ లబ్ధిదారుల వద్దకు మత్స్య శాఖ సిబ్బంది స్వయంగా వచ్చి సంతకాలు తీసుకుంటారన్నారు. లబ్ధిదారులు తమ ఆధార్, రేషన్ కార్డులు, బ్యాంకు పుస్తకం జిరాక్స్, పాస్ పోర్టు సైజు ఫొటోలను సిబ్బందికి ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

సంక్షేమ సారథిని గెలిపించుకుందాం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- ఈదరపల్లి, నడిపూడి కాలనీల్లో ఎన్నికల ప్రచారం



ఈదరపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రూరల్ మండలం ఈదరపల్లి, నడిపూడి పంచాయతీల పరిధిలోని మెట్లరాంజీ, మెట్ల సత్యనారాయణ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత ఈదరపల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన విశ్వరూప్‌కు మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాల వల్ల ఇంటింటికీ లబ్ధి చేకూరిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశీ బాలమునికుమారి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, వైస్ ఎంపీపీ అడపా సుబ్రహ్మణ్యం, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఊటాల ఉదయకుమార్, సర్పంచ్ చెల్లుబోయిన నాని, మాజీ సర్పంచ్ నక్క సపంత్‌కుమార్, కడిమి బ్రహ్మాజీ, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా అదినారాయణ, జిల్లా కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాను గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న మంత్రి విశ్వరూప్

నేడు విశ్వరూప్ ఎన్నికల ప్రచారం

ఉప్పలగుప్తం: మండలంలోని చినగాడవిల్లి, పెదగాడవిల్లి, మునిపల్లి గ్రామాల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు పొన్నాడ ఎన్నికల ప్రచారం

ఐ.పోలవరం: మండలంలోని ఐ.పోలవరంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణతో కలిసి టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ బుధవారం ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు అన్నారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

జగనన్న ప్రభుత్వంలో మంచి జరిగితే ఓటేయండి



చెయ్యేరులో ఎమ్మెల్యే పొన్నాడ, పితాని బాలకృష్ణలకు గజమాలతో స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: జగనన్న ప్రభుత్వంలో మీ కుటుంబానికి మంచి జరిగితేనే ఓటు వేయాలని ముమ్మిడివరం అసెంబ్లీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలం పరిధిలోని చెయ్యేరు పంచాయతీ చెయ్యేరు, చెయ్యేరు అగ్రహారం, వడ్డి పేట, నేతాజీ నగర్‌లలో మంగళవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణతో కలిసి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే పొన్నాడ, పితాని బాలకృష్ణలకు పార్టీ శ్రేణులు గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్న వలంటీర్లపై ప్రతిపక్ష నేతలు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ఓటు అనే ఆయుధంతో సంక్షేమ రాజ్యాన్ని గెలిపించవలసిన బాధ్యత మహిళలం దరిపై ఉందన్నారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. చెయ్యేరు అభివృద్ధికి అధిక శాతం నిధులు కేటాయించానని, చెయ్యేరు ప్రజలు ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, ఏడిది చక్రపాణిరావు, పాలెపు ధర్మారావు, నడింపల్లి సూరిబాబు, నల్లా నరసింహమూర్తి, ఏడిది సుబ్బు, నాతి సత్యనారాయణ, సంసాని నాగేశ్వరరావు, బసవా రామలక్ష్మణరావు, ముదుదుడ్డి రామారావు, నాగభూషణం డాక్టరు, మొల్లేటి గోవిందరావు, చుట్టూరి వీరవెంకట సత్యనారాయణ, మట్టా ఉదయ భాస్కరరావు, నడింపల్లి సందీప్, గుత్తుల ధర్మారాజు, తిరుకోటి శాంతి సుధ, నాతి అలివేణి, నల్లా బేబి జానకి తదితరులు పాల్గొన్నారు.

చిక్కం బాలయ్యకు అభినందనలు



చిక్కం బాలయ్య

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా నియమితులైన ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు చిక్కం బాల సుబ్రహ్మణ్యం(బాలయ్య)ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ మంగళవారం అభినందించారు. పార్టీ బలోపేతానికి, రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బాలసుబ్రహ్మణ్యంకు సూచించారు. ఆయన ఇప్పటివరకూ వైఎస్సార్ సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడిగా కొనసాగారు.

సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకూ మేలు

ఐ.పోలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో అన్ని వర్గాలకూ మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పొన్నాడ తనయుడు సత్య సుమంత్ అన్నారు. మండలంలోని కేశనకుర్రు, పొగాకులంక, చిన్నకేశనకుర్రు గ్రామాల్లో మంగళవారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య సుమంత్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రజలందరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీకి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, ఇందుకూరి రంగరాజు, పిన్నంరాజు బాబ్జిరాజు, కాశి పరివాజ్ కుమార్, చింతా రాంబాబు, వనచర్ల దత్తుడు, షేక్ సుబాన్ డాక్టర్, పెద్దిరెడ్డి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



కేశనకుర్రులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పొన్నాడ తనయుడు సత్య సుమంత్

మూడు నామినేషన్ల దాఖలు



ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన దంగేటి మహేష్‌బాబు

ముమ్మిడివరం: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఐదో రోజు మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థిగా దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు) రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా దంగేటి మహేష్‌బాబు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మదన్‌మోహనరావుకు అందజేశారు. దాట్ల వెంకట పృథ్వీరాజు ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇప్పటివరకు మొత్తం 12 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు.

మండల టాపర్‌కు సత్కారం



మండల టాపర్ ఉష ఐశ్వర్యను సత్కరిస్తున్న ఇంజరం సర్పంచ్ శివరామ ప్రసాద్ తదితరులు



గురుకుల పాఠశాల టాపర్ పూర్ణ షర్మిలను సత్కరిస్తున్న నాయకులు

తాళ్లరేవు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 583 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన ఇంజరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని బి.ఉష ఐశ్వర్యను ఘనంగా సత్కరించారు. మంగళవారం ఇంజరంలో జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యార్థిని ఉష ఐశ్వర్యతో పాటు పాఠశాల ఉపాధ్యాయులను సర్పంచ్ ముద్దన వెంకట శివరామప్రసాద్, ఉపసర్పంచ్ కోరుకొండ అప్పారావు, కోరుకొండ చంటి, పెయ్యల కొండబాబు, రామాంజనేయులు తదితరులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

గురుకులం టాపర్ కూరాటి పూర్ణ షర్మిల

గోవలంక గ్రామానికి చెందిన కూరాటి పూర్ణ షర్మిల 565 మార్కులు సాధించి చొల్లంగిపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు మోర్త భీమాబాయి, కో–ఆప్షన్ సభ్యుడు కూరాటి శ్రీకృష్ణ, పెంకే అర్జున్, కూరాటి నరసింహమూర్తి, రాజమ్మ, కూరాటి వాసు తదితరులు ఆమెను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం

ఉప్పలగుప్తం: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో మండల వ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు అక్కల బిందు శరణ్య, వంగా దివ్యలక్ష్మి, యెరుబండి హర్షితలను గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం లంకా రాణి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

అల్లవరం: పదోతరగతి ఫలితాల్లో 595 మార్కులు సాధించిన ఓడలరేవు ఉన్నత పాఠశాల విద్యార్థి పినపోతు ఈషితను ఓడలరేవులోని వారి నివాసంలో ఎస్‌టీయూ ప్రతినిధులు కలిసి అభినందించారు. మోసుగంటి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.5 వేలు, రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.2 వేలు ఈషితకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ అధ్యక్షుడు గురునాయుడు, కార్యదర్శి రత్నంరాజు, ఉపాధ్యాయులు ఎస్ఎస్ఎన్, నకులరాజు, ఆర్వీఎస్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్లను భద్రపరచాలి

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసే విద్యా కానుక కిట్లను రూమ్‌లలో భద్రపరచి వాటిని పర్యవేక్షించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బొరుసు వీర వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌ను, మండల రిసోర్స్ భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులకు పంపిణీ చేసే స్కూల్ బ్యాగ్స్, బెల్టు, షూలు, పుస్తకాలు తదితర సామగ్రిని అన్ని పాఠశాలలకు సరిపడా వస్తాయని వాటిని పరిశీలించి నమోదు చేసుకోవాలని ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ సీఆర్పీలకు సూచించారు. ఈ ఏడాది జూన్ 12వ తేదీలోగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు విద్యాకానుక కిట్లను అందజేసేలా ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో స్టోరేజ్ పాయింట్లను పరిశీలించారు. విద్యాకానుక కిట్లు పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఆర్పీలకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సాయిరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి



ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం హనుమజ్జయంతి వైభవంగా జరిగింది. ఆంజనేయుడికి ప్రీతికరమైన రోజైన మంగళవారం హనుమజ్జయంతి రావడంతో ఈ పర్వదినానికి ప్రాధాన్యం సంతరించుకుంది. వేకువజాము నుంచే భక్తులు ఆంజనేయస్వామి ఆలయాలకు చేరుకుని విగ్రహాన్ని సింధూర తిలకంతో అలంకరించి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెదపళ్లలో వేంచేసిన ఆంజనేయస్వామి ఆలయంలో కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద భారీ అన్నసమారాధనలు జరిగాయి. హనుమజ్జయంతిని పురస్కరించుకుని పలు ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

సకుటుంబ సపరివార సమేతంగా ప్రచారం



వృద్ధురాలిని ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే పొన్నాడ



కాట్రేనికోన తీర ప్రాంత గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ భార్య నీరజ

- ప్రచారంలోకి ఎమ్మెల్యే పొన్నాడ కుటుంబ సభ్యులు, బంధుగణం
- ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ఆకట్టుకునే యత్నం



మురమళ్లలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తనయులు సత్య సుమంత్, రేవంత్‌లు

ముమ్మిడివరం: ఎన్నికల ప్రచారంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ వినూత్న పంథాలో సకుటుంబ సపరివార సమేతంగా దూసుకెళుతున్నారు. ఒకవైపు తాను నియోజకవర్గంలో విస్తృతంగా తిరుగుతూనే తన కుటుంబసభ్యుల్ని, బంధుగణాన్ని, అనుచరుల్ని సైతం ఎన్నికల ప్రచారంలోకి దింపారు. ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో పక్కా ప్రణాళికతో అందరూ తలో దిక్కుకి వెళ్లి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ నియోజకవర్గమంతా చుట్టేస్తున్నారు. ప్రచార పర్వంలో ప్రత్యర్థుల కంటే ముందంజలో ఉండేందుకు అవసరమైన అన్ని అస్త్రాల్ని ఉపయోగిస్తున్నారు. ఎమ్మెల్యే పొన్నాడ గ్రామాలకు వెళ్లి ఇంటింటా ఎన్నికల ప్రచారంతో పాటు వివిధ సంఘీయులతో సమావేశాలు నిర్వహిస్తూ మద్దతును కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకోవైపు ఎమ్మెల్యే పొన్నాడ తల్లి రామానుజమ్మ, భార్య నీరజ సైతం కాట్రేనికోన మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. ఎమ్మెల్యే పొన్నాడ తనయులు సత్య సుమంత్, రేవంత్‌లు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఐ.పోలవరం మండలంలో విస్తృతంగా తిరుగుతున్నారు. ఎమ్మెల్యే పొన్నాడ మేనత్త వల్లభుని ధనలక్ష్మి, అక్కాచెల్లెళ్లు కర్రి సత్యవాణి, ఎ.మాధవీరాణి, వల్లభుని సత్యకుమారి తదితర బంధుగణం సైతం ప్రచారంలో పాల్గొని మహిళలకు బొట్టు పెట్టి వైఎస్సార్ సీపీకి ఓటేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. మరోవైపు ఇటీవల పార్టీలో చేరిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ సైతం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ తన వర్గీయులతో సమావేశమై క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి యత్నిస్తున్నారు. పొన్నాడ విజయం కోసం కుటుంబ సభ్యులంతా రంగంలోకి దిగి ప్రచారం చేస్తుండడం గ్రామాల్లో చర్చనీయాంశమవ్వడంతో పాటు ఓటర్ల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

జగనన్నను గెలిపిస్తేనే పేదలకు సంక్షేమం

కాట్రేనికోన: రానున్న ఎన్నికల్లో జగనన్నను గెలిపించుకుంటేనే పేదలకు సంక్షేమం అందుతుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సతీమణి నీరజ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని నీళ్లరేవు, చిర్రయానం, గచ్చకాయలపోర, మర్రిచెట్టు కాలనీ, ఎంజీఆర్ కాలనీ, నాగపట్టణం, రాజానగరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి నీరజ మాట్లాడుతూ సంక్షేమ రాజ్యం రావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో తమ గ్రామం విచ్చేసిన పొన్నాడ సతీమణి నీరజ, తల్లి రామానుజమ్మ, కుటుంబ సభ్యులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తీర గ్రామాల అభివృద్ధికి పాటుపడిన తన బిడ్డకు అండగా నిలిచి ఓటు వేసి గెలుపించాలని పొన్నాడ తల్లి రామానుజమ్మ పిలుపునిచ్చారు. పొన్నాడ కుటుంబ సభ్యులు బ్రహ్మసమేధ్యంలో కాలభైరవస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నీళ్లరేవు గ్రామ పెద్దలు ఓలేటి మంగాదేవి, నాగేశ్వరరావు, పాలెపు గంగయ్య, అంగాని సత్యం, కర్రి ధనుంజయ, సంగాని మునేంద్ర, బొమ్మిడి సూరిబాబు, ఓలేటి సత్యరాయణరాజు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



నీళ్లరేవులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీమణి నీరజ

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న స్కూలు ప్రతినిధులు మేరీగ్రేస్, అరుణ

తాళ్లరేవు: ఈ నెల 20, 21వ తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్ర స్థాయి మోడరన్ పెంటాథలాన్ క్రీడా పోటీల్లో విద్యార్థులు బి.ప్రవల్లిక, ఆర్.యక్షిత, సాత్విక, చరణ్, శ్రీవల్లి, నూతన ప్రభలు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. మంగళవారం జార్జిపేట ఎంఎల్‌కె నగర్‌లోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ మేరీగ్రేస్, ప్రిన్సిపాల్ సిస్టర్ అరుణ తదితరులు విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. వారిలో బి.ప్రవల్లిక, ఆర్.యక్షిత పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి ఈ నెల 27 నుంచి 30 వరకు ముంబైలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ పీడీ సూర్యాపాల్, ఉపాధ్యాయులు శ్యామల, మరియా, రాణి, నిర్మల, తులసి, దేవి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ఏర్పాటు చేసిన వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యులు

అమలాపురం రూరల్: అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్, మహిళా వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్‌కేబీఆర్ కళాశాలలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కాలేజీలో ప్రస్తుతం డిగ్రీ విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నందున ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి విద్యార్థులకు చల్లటి నీరు అందించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామని సప్పా నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, మహిళ క్లబ్ అధ్యక్షురాలు ఎస్ఎస్ పద్మావతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార శాస్త్రి, అధ్యాపకులు వడలి రాధాకృష్ణ, ఆకెళ్ళ శర్మ, వాకర్స్ క్లబ్ కార్యదర్శులు వలవల నాయుడు, యరమిల్లి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత యానాంకు కృషి చేయాలి

యానాం: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్లాస్టిక్ రహిత యానాంకు కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రతినిధి కేవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు డి.త్రిమూర్తులు అధ్యక్షతన ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై సదస్సు నిర్వహించారు. పాస్టిక్ వస్తువుల తయారీలో ఎక్కువ కాలం మన్నేందుకు వివిధ రసాయనాలు వాడతారని, దానివల్ల అవి మట్టిలో కలవకుండా పోవడంతో పాటు భూమి విషతుల్యంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని దుర్గాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి తీర్థం

అంబాజీపేట: మాచవరం గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి తీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు అమ్మవారి పూజ ఘటాలకు పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.